క్లుప్తంగా

లింకు రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు చెక్

రోడ్డు విస్తరణ పనులకు
రూ.1.20కోట్ల నిధులు మంజూరు

మీర్‌పేట: ఆర్‌సీఐ–నందనవనం లింకు రోడ్డుతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని 39వ డివిజన్ కార్పొరేటర్ మాదరి సురేఖరమేశ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్‌సీఐ–నందనవనం లింకు రోడ్డు విస్తరణకు మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో రూ.1.20కోట్లు నిధులు మంజూరు చేయించరన్నారు. ఆర్‌సీఐ ప్రధాన రహదారి నుంచి మిథులానగర్, దాసరి నారాయణరావుకాలనీ, కమలానెహ్రూనగర్, లలితానగర్ చౌరస్తా మీదుగా నందనవనం వరకు లింకు రోడ్డు విస్తరించి అభివృద్ధి చేసి ప్రధాన రహదారులకు అనుసంధానం చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ నియామకం


గ్రామ అధ్యక్షుడు అంజయ్య


యూత్ అధ్యక్షుడు శ్రీను

రంగారెడ్డి జిల్లా: బీఆర్‌ఎస్ పోరండ్ల గ్రామశాఖ అధ్యక్షుడిగా తవిటి అంజయ్య ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల పరిధిలోని పోరండ్లలో సర్పంచ్ శకుంతల, ఉపసర్పంచ్ పెంజర్ల మల్లేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ మోడి జంగయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మోడి కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా ఎండీ.రహీం, యూత్ అధ్యక్షుడిగా దన్నె శ్రీను, యూత్ ఉపాధ్యక్షుడిగా మోడి మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా సంగం శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

మంత్రిపై ఆరోపణలు తగవు

బీఆర్‌ఎస్ నియోజకవర్గ
ప్రధాన కార్యదర్శి బాలకిషన్

దిల్‌సుఖ్‌నగర్: మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొత్త మనోహర్ రెడ్డికి తగదని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు బేర బాలకిషన్, మురుకుంట్ల అరవింద్ శర్మ, ఉపాధ్యక్షుడు నరేందర్ గౌడ్ అన్నారు. ఆర్‌కేపురం గ్రీన్‌హిల్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... సమస్యలు ఉంటే అంతర్గతంగా పరిష్కరించుకోవాలే తప్ప బహిరంగ ఆరోపణలు చేయరాదని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి అంజయ్య ముదిరాజ్, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల శేఖర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా ఫరీద్


ఫరీద్‌కు నియామకపత్రం అందిస్తున్న వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎండీ.ఫరీద్‌ను నియమించారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్‌కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫరీద్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాములు, మానయ్య, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'బచ్‌పన్' స్నాతకోత్సవం


స్నాతకోత్సవంలో పాల్గొన్న రూపారెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం హిల్ కాలనీలోని బచ్‌పన్ పాఠశాల స్నాతకోత్సవ సంబురాలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్స్ రీజనల్ డైరెక్టర్స్ కె.శ్రీకాంత్‌రెడ్డి, కె.రూపారెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి చిన్నారులే రేపటి దేశ ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులని, వీరి చేతుల్లోనే దేశ పురోభివృద్ధి ఉందన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య డంపింగ్ యార్డు

- దుర్వాసన, రోగాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు


జల్‌పల్లిలో అక్రమంగా కొనసాగుతున్న డంపింగ్ యార్డు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో జనావాసాల నడుమ అక్రమంగా కొనసాగుతున్న చెత్త డంపింగ్ యార్డ్‌లతో ప్రజలు ఆందోళనలకు గురవుతున్నారు. ఒకవైపు వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో విష జ్వరాలు ప్రబలుతుండడం.. మరో వైపు ఎప్పుడు ఎలాంటి అగ్ని ప్రమాదం సంభవిస్తుందో తెలియక స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వేసవి కాలం ప్రారంభం కావడం.. నగరంలో నిత్యం ఏదో ఒక చోట డంపింగ్ యార్డ్‌లలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం చూసి ప్రజలు జంకుతున్నారు. జల్‌పల్లి కమాన్ రోడ్డు, శ్రీరాం కాలనీలలో వీటి సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. అనధికార చెత్త పాయింట్ల వద్ద ప్లాస్టిక్, ఇతర విలువైన వ్యర్థాలను సేకరించి ఈ డంప్‌లలో పోగు చేస్తున్నారు. జనావాసాల నడుమ డంపింగ్ యార్డ్‌లను కొనసాగిస్తూ పెద్ద ఎత్తున చెత్తను పోగు చేస్తుండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ వ్యర్థాలలో దోమలు, ఈగలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

డంపింగ్ యార్డ్‌లలోని వ్యర్థాలలో అనేక రకాల వస్తువులు ఉంటుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చెత్తలో లభ్యమయ్యే ఇనుప వస్తువులు, పేలుడు స్వభావం కలిగిన వస్తువులను కూడా నిర్వాహకులు అవగాహన రాహిత్యంతో నిల్వ ఉంచుతున్నారు. ప్రమాదాలు జరిగితే తమ పరిస్థితి ఏమిటని బస్తీ వాసులు ఆందోళన చెందుతున్నారు. రెండు మూడు నెలలకోసారి ఏదో ఒక డంపింగ్ యార్డ్‌లలో అగ్నిప్రమాదం జరగడం పరిపాటిగా మారిందని వాపోతున్నారు. మంటలు అదుపుకాకపోతే తమ ఇళ్లు దగ్ధమయ్యే ప్రమాదం ఉందంటున్నారు. పక్షం రోజుల క్రితం జల్‌పల్లి కమాన్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో స్క్రాప్ గోడౌన్ పక్కనే ఉన్న డీసీఎంలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి.

కొరవడిన పర్యవేక్షణ

మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్‌లను వెంటనే తొలగించాలని యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు అధికారులకు పలుమార్లు విన్నవించారు. అప్పటి వరకు స్పందిస్తున్న మున్సిపాలిటీ అధికారులు అనంతరం మిన్నకుండి పోతున్నారు. నాలుగైదు రోజులు తూతూ మంత్రంగా మూసివేయిస్తున్నారు. అనంతరం యథేచ్ఛగా తమ అక్రమ దందాలను కొనసాగిస్తున్నారు.

అధికారులు స్పందించాలి



మున్సిపాలిటీలో అక్రమంగా కొనసాగుతున్న చెత్త డంపింగ్ యార్డ్‌లను వెంటనే తొలగించాలి. జనవాసాల నడుమ ఉన్న స్క్రాప్ గోడౌన్‌లతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. గల్లీల్లలో ఏర్పాటు చేస్తున్న వీటి వద్ద ప్రమాదం సంభవిస్తే ఫైరింజన్లు కూడా వచ్చే మార్గం లేదు. వేసవిలో ప్రమాదాలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వెంటనే వీటిని మూసివేయించాలి.

– యంజాల శివకుమార్, జల్‌పల్లి


ముగిసిన ప్రతిష్ఠాపనోత్సవాలు

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


కల్యాణం చేస్తున్న వేద పండితులు

రంగారెడ్డి జిల్లా: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో సీతారామ లక్ష్మణ సహిత విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ పూజలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజల అనంతరం 8.35గంటలకు యంత్రస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మోదిని శంకరప్ప, శివ కుమార్, శివ మూర్తి, శివ ప్రసాద్, గాండ్ల వీరన్న, వైస్ ఎంపీపీ సునీత, ఎంపీటీసీ సభ్యుడు పి.సుదర్శన్ యాదవ్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ సభ్యులు నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం, మహేశ్వరం సీఐ శివమూర్తి, మాజీ సర్పంచ్ కూన యాదయ్య, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎం.నవీన్, శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ కర్రోళ్ల చంద్రయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య, నాయకులు దోమ శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, అల్లె కుమార్, అశోక్, మల్లేశ్, శ్రీనివాస్, జంగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభకు పదును



సోలార్ సిటీ మోడల్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎల్‌బీనగర్: పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయటం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతతోపాటు ప్రతిభకు పదును పెట్టినట్లు అవుతుందని హయత్‌నగర్ ఎంఈఓ హీర్యానాయక్ అన్నారు. ఆదివారం వనస్థలిపురంలోని అక్షర పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను అక్షర గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నిర్వాహకుడు వి.అశోక్‌రెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన మోడల్ పాఠశాల, నాగార్జున సాగర్ డ్యాం, సోలార్ సిటీ, అగ్ని పర్వతం నుంచి లావా ప్రవాహం, అయస్కాంత క్షేత్రంతో విద్యుత్ తయారీ, టర్బైన్ విద్యుత్ తయారీ, వీధి దీపాల టైమర్ వంటి ప్రదర్శనలు ఆహూతులను ఆలోచింప చేశాయి. కార్యక్రమంలో అక్షర పాఠశాలల ఇంచార్జిలు సాగర్‌బాయి, నాగలక్ష్మి, సత్యవాణి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: నియోజకవర్గ పరిధి బాలాపూర్‌లోని మలన్న స్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, ఎర్ర మహేశ్వరి జైహింద్, గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలతోపాటు, బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్లు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లు, మహేశ్వరం, కందుకూర్ మండలాలు, గ్రామాలు తండాల్లోని ప్రజలపై చల్లని దీవెనలు కల్పించేలా చూడాలని మేయర్ పారిజాతారెడ్డి వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో స్థానిక నాయకులు రియాసత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, కార్పొరేటర్ బాలునాయక్, నాయకులు రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, ప్రవీణ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ వ్యవహారంపై నిగ్గు తేల్చండి


కందుకూరు: మంత్రి కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై నిగ్గు తేల్చాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఐటీ మంత్రి కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్, సౌడపు వెంకటేశ్‌గౌడ్, గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్ తదితరులు మాట్లాడారు. పేపర్ లీకేజీతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఐటీ మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సంబంధం లేకపోతే సమీక్షలో ఎలా కూర్చున్నారని, ఇద్దరే దోషులని ఎలా చెబుతున్నారని, నువ్వేమైనా విచారణాధికారివా అని ప్రశ్నించారు. పోలీసు కస్టడీ కాక ముందే ఇద్దరే దోషులని మీకెవరు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సయ్యద్ అజీజ్, సభావత్ గణేశ్‌నాయక్, ఎండీ ఖాజామొహినుద్దీన్, గుండ్ర సుధాకర్‌రెడ్డి, ఎండీ సల్మాన్, ఆలేటి ప్రభు, రాజశేఖర్‌రెడ్డి, నేచ్యానాయక్, పాపగల్ల రవీందర్, మర్ల రాములుయాదవ్, అనిల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను తొలగించాలి'

హుడాకాంప్లెక్స్: టీఎస్‌పీఎస్‌సీలో అక్రమాలు పునరావృతం కాకుండా ఉండాలంటే చైర్మన్ జనార్దన్ రెడ్డిని వెంటనే తొలగించాలని ఫిజికల్ డైరెక్టర్, నందు ఆర్మీ ఫౌండేషన్ చైర్మన్ నందులాల్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు పరీక్ష పెడుతారో.. ఎప్పుడు రద్దు చేస్తారో తెలియని దుస్థితి నెలకొందన్నారు. పేదల ఆశయాలను ప్రభుత్వం ఆడియాశలు చేస్తోందని ఆరోపించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


చౌదర్‌పల్లిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిని రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. వ్యసాయాధికారులు చౌదర్‌పల్లి, ఇస్రాయిపల్లి, కోరింతకుంటతండా, వెంకటాపూర్, ఆర్లకుంటతండా, వెంకట్రావ్‌పేట్,తదితర గ్రామాల్లో ఆదివారం ఏఓ రాజు ఆధ్వర్యంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. 10 ఎకరాల్లో మొక్కజొన్న, రెండెకరాల్లో కీరదోశ పంటలకు నష్టం జరిగిందని, దెబ్బతిన్న పంటల నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఏఓ చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు నిఖిత, శ్రీనాథ్, శ్రీకాంత్, విజయ్, శిరిష, సర్పంచ్ చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: చౌదర్‌పల్లికి చెందిన కాలె యాదయ్య ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు లేక ఇంటి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపి వేశాడు. స్థానిక నాయకుడు ప్రదీప్‌రెడ్డి సహకారంతో జెడ్పీటీసీ వెంకటేశ్‌ను కలిసి ఆర్థికసాయం కోరారు. స్పందించిన జెడ్పీటీసీ.. ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులతో ఆదివారం ఇంటి నిర్మాణానికి అయ్యే మెటీరియల్‌ను యాదయ్యకు అందజేశారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి దాతల చేయూత భేష్


బస్ షెల్టర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: బస్ షెల్టర్ నిర్మాణానికి దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం తూర్పు ఫేజ్–1 కాలనీలో సాగర్ రహదారిపై దాత రామాంజనేయులు సహకారంతో నూతనంగా బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఆ బస్ షెల్టర్‌ను ఆదివారం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులు అనిల్ చౌదరి, వేములయ్యగౌడ్, లతా ఆనంద్‌రాజ్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, కాలనీ నేతలు భూపతిరెడ్డి, కృష్ణయ్యగౌడ్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌కుమార్


అభివాదం చేస్తున్న అజయ్‌కుమార్ తదితరులు

తుక్కుగూడ: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను చిన్న చూపు చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రి చేయడమే ప్రజా పార్టీ లక్ష్యమని చెప్పారు. అనంతరం ఆ గ్రామంలోని పలువురు నాయకులు ప్రజా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని నియమించారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా అంబోజీ నర్సింహ యాదవ్, ఉపాధ్యక్షుడిగా శంకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నారాయణ యాదవ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో కల్యాణ్‌యాదవ్, అంజి యాదవ్, శంకర్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ బీరప్ప


పుష్ప సినిమా ఫేమ్ కేశవను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ చప్పిడి అడివిరెడ్డి గార్డెన్‌లో లార్డ్స్ విద్యాసంస్థల 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన పుష్ప సినిమా ఫేమ్ కేశవ(జగదీశ్ ప్రసాద్) పాల్గొని తన డైలాగులతో అలరించారు. ఈ కార్యక్రమానికి మీర్‌పేట్ సీఐ మహేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు గౌర రమాదేవి, అనిల్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు శ్రీలత, అనురాధ, ఎంఈఓ కృష్ణ, ప్రిన్సిపాల్స్ సంతోశ్, బానూరు శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి రేఖ, ఉపాధ్యాయులు, సిబ్బంది, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆదర్శాల సాధనే లక్ష్యంగా సీఎం పాలన

బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు


పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కృష్ణమోహన్‌రావు తదితరులు

హయత్‌నగర్: ఆదర్శ దంపతులు జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే జీవితాలు ప్రపంచానికే ఆదర్శమని, పూలే ఆదర్శాల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. హయత్‌నగర్‌లో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ జరిగింది. అందులో భాగంగా ఆదివారం వారి విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వకుళాభరణం మాట్లాడుతూ... స్వాతంత్ర్యానికి పూర్వమే కుల మతాలకు అతీతంగా అందరికీ విద్య అందాలనే మహోన్నతాశయంతో పాఠశాలలు నెలకొల్పిన గొప్ప సంఘ సంస్కర్తలు పూలే దంపతులు అని కొనియాడారు. అనంతరం బీసీ సంఘం జాతీయ నాయకుడు దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ... కుల వివక్షత, నిరక్షరాస్యత ఉన్న రోజుల్లో పూలే దంపతుల సమాజానికి చేసిన సేవ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని చెప్పారు. నాయకులు ఈశ్వరమ్మ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, కడారి యాదగిరి, బాబా యాదవ్, ఉమా యాదవ్, ఆహ్వాన సంఘం నాయకులు పారంద స్వామి, ఎర్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

తలకొండపల్లి: పెరగుతున్న నిత్యావసర ధరలను తక్షణమే నియంత్రించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూర్ జగన్ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా వారు జేపట్టిన జీపుజాత ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో జగన్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. కార్మికుల పట్ల కక్ష్యపూరిత విధానాలను అవలంభిస్తోందని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు రవికుమార్, ప్రజాతంత్ర నాయకులు కురుమయ్య, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి రమేష్, పోచయ్య, పర్వతాలు, కళాజాత నాయకులు శేఖర్, అఖిల్, శ్రీనివాస్, ధనంజయ, సీఐటీయు నేతలు పాల్గొన్నారు.